
# ఆకలి

మ. రుక్మిణీ గోపాల్

అది తమిళుల ఇంట్లో పెళ్లి. వారి ఆచార ప్రకారం ఇంటిముందు ఆవరణలో ఉయ్యాల వేసారు. దానిమీద పెళ్లికొడుకుని, పెళ్లికూతుర్నీ కూర్చోబెట్టారు. ఒక పెద్ద పళ్లెం నిండా ఎర్రటి అన్నం ముద్దలు – బహుశా పారాణితో కలిపి ఉంటారు... పట్టుకొచ్చి అక్కడ పెట్టారు. ముఖ్య బంధువులలో ఆడవారు ఒక్కొక్కరే వెళ్లి ఒక అన్నపుముద్దను చేతిలోకి తీసుకుని పెళ్లికొడుకు, పెళ్లికూతురు తలల చుట్టూ మూడుసార్లు తిప్పి దిష్టితీసి అవతల పారేస్తున్నారు.

ఇదంతా దూరంనుంచి చూస్తూ నుంచుంది రంగి. దానికి ఐదేళ్లకంటే ఎక్కువ వయసు ఉండదు. చంకలో రెండేళ్లు నిండిన తమ్ముణ్ణి ఎత్తుకుని ఉంది. ఆకలితో దాని కడుపులో పేగులు అరుస్తున్నాయి. నిన్న పొద్దుటినుంచి అది మెతుకు కొరకలేదు. రెండుమూడు రోజుల నుంచి తండ్రికి కూలి దొరకక ఇంట్లో బియ్యం కొనుక్కునేందుకు డబ్బుల్లేవు. ఆఖరికి గంజి కాచేందుకు నూకలైనా లేక తల్లి పొయ్యి రాజెయ్యలేదు. నిన్నటినుంచే ఆకలంటూ చిన్నోడు (తమ్ముడు) ఒకటే ఏడుపు. ఏడ్చినా తినేందుకు దొరకదని రంగికి తెలుసు. అంచేత ఆకలేస్తున్నా రంగి ఏడవలేదు. చిన్నోడు రాత్రి నిద్దట్లో కొంత సేపు ఏడుపు ఆపినా తెల్లారిన దగ్గర నుంచి మళ్లీ ఆరున్నొక్కరాగం మొదలెట్టాడు. ఈలోగా పెళ్లిబాజాల చప్పుడు వినిపించింది. రంగి వాణ్ణి చంకనేసుకుని వచ్చి కొంచెం దూరంగా నిలబడి ఈ దృశ్యాన్ని చూస్తోంది. బాజాల చప్పుడు... ఈ సందడి చూసి చిన్నోడు తాత్కాలికంగా ఏడుపు మానాడు.

ఆ అన్నంముద్దలు చూసేసరికి రంగికి నోట్లో నీరూరింది. కళ్లల్లో ఆశ చోటు చేసుకుంది. 'ఓ రెండుముద్దలు తిననిస్తే బాగుండును. తనొకటి, తమ్ముడొకటి తినేవాళ్లు' అనుకుంది. కానీ ఆ పిల్లలకు ఒక్కటి కూడా దక్కలేదు. పెద్ద పళ్లెంనిండావున్న ముద్దలు దిష్టితీసి అవతల కింద పారేసారు. ఆ కార్యక్రమం ముగియటంతో అందరూ లోపలికి వెళ్లిపోయారు. అక్కడ ఎవ్వరూ లేరని నిర్ధారణకాగానే రంగి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ అన్నం ముద్దలు పడినచోటికి చేరింది. ముద్దలు చెల్లాచెదురుగా అటూ ఇటూ పడిఉన్నాయి. కిందనున్న మట్టి వాటికి అంటుకుపోయింది. అయినా ఒకటితీసి సాధ్యమైనంతవరకూ మట్టిదులిపి చిన్నోడికి ఇచ్చి "తినరా" అంది. తనొకటి తీసుకుని నోటితో కొరికింది. అంటుకున్న మట్టి రుచేకాక ఏమిటో చాలా వెగటుగా ఉంది. కడుపులో బాగా ఆకలిగా ఉన్నా అది మింగుడు పడటం లేదు.




చిన్నోడు కొంచెం కొరికి తినటానికి ప్రయత్నించి, తుపుక్కున ఉమ్మేసి, చేతిలో ఉన్న ముద్ద గిరాటు వేసేసాడు. ఈ ముద్ద కొరకటంతో మర్చిపోయిన ఆకలి వాడికి మళ్లీ గుర్తుకొచ్చింది. మళ్లీ రాగాలు పునఃప్రారంభించాడు. రంగి ఎంత ప్రయత్నించినా ఒక ముద్ద కూడా పూర్తిగా తినలేకపోయింది. "ఏడవకురా, అమ్మ బువ్వొండిందేమో చూద్దాం పద" అంటూ గుడిసె వైపు బయలుదేరింది. గుడిసె దగ్గరకు వెళ్లే సరికి లోపల అమ్మా, నాన్నా కోట్లాడుకోవటం వినిపించింది. "కూలీ దొరక్కపోతే నన్నేటి సెయ్యమంటావే? కూలి దొరికితే నేఎళ్లనన్నానా?" అంటున్నాడు తండ్రి.


"ఏ అప్పో, సప్పో సేసి కాసిని గింజలు తేకపోతే పిల్లలకేంపెట్టను? మనం పస్తులున్నా ఫరవాలేదు కానీ పసివాళ్లు ఆకలికి ఆగగలరా?" అంటోంది తల్లి. "మనకి అప్పు ఎవడిస్తాడే? ఇప్పటికి చేసిన అప్పుల్లో ఒక్కటైనా జమ కట్టామా? ఇంక మనకి అప్పు ఎలా ఇస్తారే?" అన్నాడు తండ్రి. ఇదంతా విన్న రంగికి పరిస్థితి అర్థమైంది. ఇంట్లో ఎప్పుడు బియ్యం లేకపోయినా ఇలాగే గొడవ జరుగుతుంది. 'ఇంక గుడిసెలోకెళ్లి లాభంలేదు. తమ్ముణ్ణి బైటతిప్పి ఏదో చూపించి, చెప్పి ఎలాగో అలాగ మరిపించాలి' అనుకుంటూ రంగి వచ్చినదారే మళ్లీ పట్టింది.

"ఏడవకురా చిన్నోడా, మధ్యాహ్నం భోజనాలు అయ్యాక అరు ఇస్తళ్లు బైట పారేస్తారు. వాటిల్లో ఏమన్నా దొరకొచ్చు" అంటూ తమ్ముణ్ణి సముదాయించేందుకు ప్రయత్నించింది. ఇది వాడికి అర్థమైందో, లేదో తెలియదుకానీ మధ్య మధ్య బాజాలచప్పుడు, రకరకాల వాహనాల రాకపోకలు, జనం సందడి... వీటితో చిన్నోడు కొంత ఊరడిల్లాడు. 'విస్తళ్లు ఎప్పుడు బైట పడేస్తారా' అని ఎదురుచూస్తూ కూర్చుంది రంగి. పోనీ పెళ్లి చూస్తూ కాలక్షేపం చేద్దామంటే పెళ్లి ఎక్కడో లోపల జరుగుతోంది. తమను అక్కడికి రానివ్వరు. బైట కనిపెట్టుకుని ఉండాల్సిందే. చిన్నోడు మళ్లీ ఏడుపు మొదలు పెట్టకుండా వాడితో ఏవో చిన్న చిన్న ఆటలు

ఆడుతూ కాలక్షేపం చేస్తోంది. కానీ ఆ పిల్ల దృష్టంతా రాబోయే ఎంగిలాకులమీదే ఉంది. 'పెద్దోళ్లిళ్లలో పెళ్లికి చాలా వంటలు వండుతారట. తియ్యటివి, కమ్మటివి చాలా అప్పచ్చులు చేస్తారట! ఎవరి విస్తట్లోనైనా, ఏ అప్పచ్చయినా తమకు దొరకకపోతుందా!' అన్న ఆశ ఆ పిల్లలో అంకురించింది. ఆ ఆశతోనే నిరీక్షిస్తోంది.

చాలాసేపు తరువాత రంగి తపస్సు ఫలించిందా అన్నట్టు లోపలినుంచి ఇద్దరు ముగ్గురు మనుషులు ఎంగిలి విస్తరాకులు దొంతరలు తీసుకొచ్చి బైటపారేసారు. ఆ విస్తళ్లు రంగి కూర్చున్నచోట కొద్ది దూరంలో పడ్డాయి. రంగి గమ్మున చిన్నోడిని చంకనేసుకుని అవైపు పరిగెత్తింది. ఇంతలో ఎక్కణ్ణుంచి వచ్చాయోగానీ నాలుగైదు కుక్కలు పరిగెత్తుకుంటూ వచ్చి రంగి కంటే ముందు ఆక్రమించుకున్నాయి. రంగి బ్రాన్పడిపోయి చూస్తూ నిలబడిపోయింది. విస్తళ్లలో రకరకాల పదార్థాలు కనబడుతున్నాయి. అన్నం, పప్పు, కూరలు, పచ్చన్నం, అప్పచ్చులు... అన్నిటినీ కుక్కలు తినేస్తున్నాయి. అన్నాన్ని ఆనమాలు కట్టిన చిన్నోడు "అమ్మ, అమ్మ" అంటూ చంకలో గింజుకోవటం మొదలెట్టాడు. రంగికి నోరూరటానికి బదులు కళ్లల్లో నీరూరింది.

'వీటికోసం తను ఎంతసేపటి నుంచి ఎదురుచూసింది? చివరకు ఏమీ దక్కలేదు'. అయినా ఆ పిల్లను ఆశ పూర్తిగా వదలలేదు. తమ్ముణ్ణి కొంచెం దూరంగా కూర్చోబెట్టి ఒకటి రెండు ఆకులు నెమ్మదిగా లాగుదామని ప్రయత్నించింది. ఆ ప్రయత్నాన్ని పసికట్టిన వాటి హక్కుదారు 'భౌభౌ' మంటూ రంగిచేతిని కరవబోయింది. రంగి గమ్మున చెయ్యిలాగేసుకుని పరిగెత్తిపోయింది.



అయినా ఆ పిల్లలో ఆశ పూర్తిగా చావలేదు. 'ఆ విస్తళ్లలో ఏ కొంచమైనా వదిలేసి వెళ్లిపోతాయేమో! అప్పుడు తీసుకుని తినొచ్చు' అన్న ఆశతో చూస్తూ నిలబడింది కానీ అంత వెర్రి కుక్కలకు లేదు. ఒక్క మెతుకు కూడా వదలకుండా తినేసి, నాకేసి, ఆ ప్రయత్నంలో విస్తళ్లను కూడా చింపేసి వెళ్లిపోయాయి. రంగికి దుఃఖం పొంగివచ్చింది. పైకి ఏడిస్తే బాగుండదన్న సిగ్గు చేత కళ్లు తుడుచుకుంటూ, అన్నం వాసన తగిలి మళ్లీ ఏడుపు ప్రారంభించిన చిన్నోడిని చంకన వేసుకుని గుడిసెవేపు బయలుదేరింది. ●

